క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



జి.మామిడాడలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడలో కనకదుర్గమ్మ వారి ఆలయ 29వ వార్షికోత్సవాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. గ్రామంతో పాటు పెద్దాడ, రాజుపాలెం, గండ్రేడుల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

నేడు ఊలపల్లిలో గడప గడపకూ..

బిక్కవోలు: ఊలపల్లిలో రెండో రోజు గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటారు.

రేపు విద్యుత్ అంతరాయం

బిక్కవోలు: బలభద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటలో పేర్కొన్నారు. బలభద్రపురం, కాపవరం, గంగులూరి పాకలు, కానేదులోని ఇండస్ట్రీయల్ ఏరియాలో శుక్రవారం వార్షిక మరమ్మతుల నిమిత్తం అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం

రాజానగరం: దివాన్ చెరువులోని ఏకశిల లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలకు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు రాటపాతి శ్రీకారం చుట్టారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా ఇక్కడ ఉత్సవాలను నిర్వహిస్తారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అక్కిరెడ్డి మహేష్, ఉపాధ్యక్షులు గ్రంధి నానబ్బులు, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి

సీతానగరం: ఇంటింటికీ తాగునీటి కళాయి ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీతానగరం పంచాయతీ పరిధిలోని వెలమపేటలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. పైప్‌లైన్ వేయడానికి గోతులు తవ్వుతున్నారని, త్వరలో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి, రక్షిత నీరు అందిస్తామన్నారు.

రిజిస్ట్రేషన్లు వెంటనే పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాస్ చౌదరి

పెదపూడి: ఓటీఎస్ పెండింగ్ రిజిస్ట్రేషన్లను వెంటనే పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాస్ చౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24లో మండలంలో ఇంటి పన్నులకు సంబంధించి వసూలు చేయాల్సిన డిమాండ్‌కు అదనంగా 5 శాతం పెంచి వసూలు చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మెరుగుపర్చాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చే విధంగా వర్మికంపోస్టు ఎరువు తయారు చేయించి రైతులకు విక్రయించాలన్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపర్చాలన్నారు. సచివాలయ కార్యదర్శులు ఎం.త్రినాథ్, అచ్చిరాజు, ఎస్‌వీ స్వామినాయుడు, ప్రసన్నకుమార్, గౌతమి, శిరీష, తరుణ్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



పెదరాయవరం ఆర్బీకేలో ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

రంగంపేట: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కూరాకుల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పెదరాయవరంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. యూరియా 222 మెట్రిక్ టన్నులు, డీఏపీ 80 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. యూరియా బస్తా రూ. 266.50, డీఏపీ బస్తా రూ.13,50కు అందిస్తున్నామన్నారు. పురుగు మందులు ఇండెంట్ పెట్టామని త్వరలోనే పురుగు మందులు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులకు అండగా జగన్ ప్రభుత్వం

- వారిని అన్ని విధాలా ఆదుకుంటాం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముంపునకు గురైన పొలాల పరిశీలన



శ్రీరంగపట్నంలో ముంపునకు గురైన పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: జగన్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అన్నదాతలకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని రాజుగారి చెరువు ప్రాంతంలో ముంపుకు గురైన పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ సాయం అందేలా ప్రయత్నిద్దామని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇలాంటి సమస్యల తీవ్రత పెరిగిందన్నారు. వంతెనలు కట్టాల్సిన ప్రాంతంలో తూరలు, కల్వర్టులతో తూతూమంత్రంగా పనులు చేపట్టారని ఆరోపించారు. అందుకు మిర్తిపాడు వద్ద ఉన్న కాజ్‌వే ఉదాహరణ అన్నారు.

ఇరిగేషన్ పనులకు నిధులు

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన నాలుగేళ్లలో నియోజకవర్గంలో 53 మైనర్ ఇరిగేషన్ పనులకు రూ.38 కోట్లు మంజూరు చేయించామన్నారు. వీటికి సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. రూ.20 కోట్లతో చేపట్టిన తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ మోడలేషన్ పనులు ఇప్పటికే 40 శాతం మేరకు జరిగాయన్నారు. సీతానగరం, కోరుకొండ మండలాల పరిధిలో 25 వేల ఎకరాలలోని పంటకు ముంపుకు గురవుతూ ఉంటుందని, ఇకపై ఆయా రైతులకు ఏవిధమైన నష్టం వాటిల్లకుండా తొర్రిగడ్డ డ్రైన్‌పై బొబ్బిల్లంక వద్ద గోదావరిలో రివర్స్ పంపింగ్ స్కీమ్ ఏర్పాటుకు రూ.91 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వర్రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోశయ్య, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడియాల పాపారావు, వైస్ ఎంపీపీ కోయిడాల నానాజీ, వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, ఇరిగేషన్ ఏఈ శివప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి పాటుపడాలి



పాలమూరులో మొక్క నాటిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పర్యావరణ హితానికి సమాజంలో ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం పాలమూరులో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో విచక్షణా రహితంగా చెట్లను నరికివేయడం మానవ మనుగడకే ప్రమాదమని అన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతోనే వాతావరణ మార్పులకు కారణమవుతుందని, దీంతో భూమి ఉపరితలం వేడెక్కి కాలుష్యం పెరుగుతోందన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొవ్వూరి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ చందు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ఊలపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఊలపల్లిలో గడప గడపకూ..

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఊలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014లో చంద్రబాబు వందల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత ఓ ఒక్క పథకాన్ని అమలు చేయకుండా ప్రజలను మోసగించారని గుర్తు చేశారు. 2019లో జగన్ ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేయడమే కాకుండా మరెన్నో పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మళ్లీ ఎన్నిక సమయం దగ్గర పడుతుండడంతో టీడీపీ నేతలు మాయమాటలు చెబుతున్నారని అన్నారు. వీటిని ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని అన్నారు. సర్పంచ్ బందారు రమ్య, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బందారు శివ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు ముత్యాలరావు, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ కొంకుదురు పీపీ తదితరులు పాల్గొన్నారు.

- ఊలపల్లి గ్రామంలో రైతులకు ట్రాక్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అందించారు. యంత్రసేవా పథకంలో భాగంగా రాయితీతో కూడిన 14 పవర్ ట్రిల్లర్లు, ఒక పెద్ద ట్రాక్టర్‌ను గ్రూపు సభ్యులకు అందించారు. అలాగే రూ.11.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

వైఎస్సార్ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కలవచర్లలో గర్భిణులు, బాలింతలకు కిట్ల పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కలవచర్లలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గల గర్భిణులు, బాలింతలకు బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నెలకు అవసరమైన మూడు కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, పావు కిలో ఆయిల్, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, ఒక కిలో అటుకులు, 2 కిలోలు రాగి పిండి, 250 గ్రాముల వేరుశెనగ చిక్కీలు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాములు ఖర్జూరం తదితర 10 రకాల వస్తువులను ఈ కిట్ల ద్వారా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలగే దోసకాయలపల్లిలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వర్రావు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొలంబడిని వినియోగించుకోవాలి

సీతానగరం: వ్యవసాయశాఖ నిర్వహించే పొలంబడిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్య రమేష్ అన్నారు. బుధవారం బొబ్బిల్లంకలో పొలంబడి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు ఎన్నో సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో రైతులు మల్లిన చౌదరి, పోలిన గోవిందరాజులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు వీరే

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగానికి అధ్యక్షులను నియమిస్తూ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజానగరానికి బత్తిన సత్తిబాబు, సీతానగరానికి పిట్ట డేనియల్ రామయ్య, కోరుకొండకు కలవరి కుమార్ నియమితులయ్యారు.

ప్రతినెలా మూడు టన్నుల సార్టెక్స్ బియ్యం పంపిణీ



బొమ్మూరులోని ఎంఎల్‌ఎల్ పాయింట్‌లో తూకాన్ని పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పరిధిలోని మండల లెవెల్ స్టాక్ పాయింట్ (ఎంఎల్‌ఎస్) ద్వారా ప్రతినెలా మూడువేల టన్నుల సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. బొమ్మూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర సరకులను సరైన తూకంలో ఎంఎస్‌ఎల్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పాయింట్ ద్వారా రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, కడియం, రాజానగరం పరిధిలోని 256 చౌకధరల దుకాణాలకు బియ్యం, పంచదార, పామయిల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా 19వ తేదీ నాటికి ఇండెంట్ వివరాలు సేకరించి ఆ మేరకు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. పౌష్టిక విలువలతో కూడిన సార్టెక్స్ బియ్యాన్ని ప్రజా పంపిణీ ద్వారా అందజేస్తున్నట్టు జేసీ భరత్ తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కె.విజయ భాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఏ.కుమార్, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఎం.కృష్ణ సుధీర్ పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం తనిఖీ

స్థానిక ఇన్నీసుపేట వద్ద మొబైల్ డెలివరీ యూనిట్ వాహనం (ఎండీయూ) ద్వారా నిత్యావసరాలు పంపిణీ జరుగుతున్న తీరును బుధవారం జేసీ తేజ్ భరత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొవ్వూరులో ప్రభుత్వ కార్యక్రమానికి వెళుతున్న ఆయన.. ఎండీయూ వాహనాన్ని చూసి ఆగారు. తూకం, ఆన్‌లైన్‌లో నమోదు, బయో మెట్రిక్, ఐరిష్ పనితీరును పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

రాజానగరం: ప్రాథమిక ఆరోగ్యానికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని, లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర్రావు హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది పనితీరు, ఓపీ, మెడిసిన్ రికార్డులు, ఆస్పత్రిలో గదులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం పీహెచ్‌సీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఉద్యోగులకు నోటీసులు ఇచ్చామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.వెంకటలక్ష్మి, డాక్టర్ కె.మేరీ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలపై ఆరా



ఎమ్మెల్యే లేఖను కమిటీ సభ్యులకు అందజేస్తున్న రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ సభ్యులు

అనపర్తి: స్థానిక రైల్వే స్టేషన్‌ను రైల్వే ప్రయాణికుల సంప్రదింపుల కమిటీ సభ్యులు బుధవారం సందర్శించారు. ఇందులో సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ ప్రయాణికుల సంప్రదింపుల కమిటీ సభ్యుడు శ్రీనివాసాచార్యులు, డివిజనల్ కమిటీ సభ్యుడు విశ్వనాథశర్మ ఉన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ నుంచి స్థానికంగా రైళ్ల హాల్టులు, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని కలిసిన అనపర్తి రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో స్థానిక రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. అనపర్తి రైల్వే స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, అండర్ పాసేజ్ తదితర అవసరాలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా ఇటీవల రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే సాంకేతిక బృందం డిమాండ్‌కు అనుగుణంగా స్థానిక ఎల్‌సీ 415 వద్ద అండర్ పాసేజ్ నిర్మిస్తే దాని నిర్వహణ బాధ్యతను పంచాయతీ ద్వారా చేపట్టేందుకు అంగీకరిస్తూ పాలకమండలి చేసిన తీర్మానాన్ని, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రతిపాదిత లేఖను బోర్డు సభ్యులకు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిటీ సభ్యులు బోర్డు సమావేశంలో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైల్వే కార్మికుల డివిజన్ కార్యదర్శి అశోక్ కుమార్, సామర్లకోట శాఖ కార్యదర్శి రాంబాబు, జోనల్ ఐటీ సెల్ కన్వీనర్ సత్యనారాయణ పాల్గొన్నారు. అనపర్తి రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్తి బుల్లితమ్ము, మల్లిడి శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రశేఖర్‌రెడ్డి, పి.సాయిప్రకాష్, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు వారిని కలిశారు.

సౌకర్యాలు కల్పించండి

బిక్కవోలు: స్థానిక రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని విజయవాడ నుంచి వచ్చిన నోడల్ అధికారి విశ్వనాథశర్మకు ఆర్‌ఎస్ పేట, బిక్కవోలు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. బిక్కవోలు రైల్వే స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. కాకినాడ నుంచి తిరుపతి వెళ్లే రైలు, రాయగడ పాసింజర్ రైలు ఇక్కడ ఆపాలని ప్రజలు కోరారు. 2, 3 ప్లాట్‌ఫారం నుంచి ఒకటో నంబరు ప్లాట్‌ఫారానికి రావడం ఇబ్బందిగా ఉందని, వంతెన ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌ఎస్‌పేట మాజీ సర్పంచ్ యామన దుర్గారావు పాల్గొన్నారు.

పిల్లలకు ముర్రుపాలు అత్యవసరం



బొబ్బిల్లంక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్ల పంపిణీ



గోకవరంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు

సీతానగరం: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు అత్యవసరమని, వాటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.ఇందిరా భారతి తెలిపారు. బొబ్బిల్లంకలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి తల్లిపాల వారోత్సవాన్ని బుధవారం స్థానిక రెండో నంబర్ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇందిరా భారతి మాట్లాడుతూ పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. టీహెచ్‌ఆర్‌లో మూడు కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో పామాయిల్, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలను సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, ఉప సర్పంచ్ కోమలి వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిన చౌదరి, ఎంపీటీసీ చిన్ని అందజేశారు. అలాగే వైఎస్సార్ పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పి.రాధారాణి, జె.గంగాభవాని, ఎం.పద్మ, ఎల్.సరోజ, డి.మణి, ఏఎన్‌ఎం దేవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో మాతాశిశు ఆరోగ్యం

గోకవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు దంపతులు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలోనే మెనూ ప్రకారం సంపూర్ణ పోషకాహారం అందించేవారన్నారు. వారు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఇంటికే పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుందన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, బత్తుల నానాజీ, తోలేటి రాంప్రసాద్, మందపాటి సతీష్, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్

బిక్కవోలు: ఇలపల్లిలో రైతులపై దాడిచేసి అక్రమ వసూళ్లకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న ఇద్దరు పాత్రికేయులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జూన్ 10న రాత్రి జరిగిన సంఘటనకు సంబంధించి మండలంలోని మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులలో పది మందిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు. పరారీలో ఉన్న బలభద్రపురానికి చెందిన సత్తి ఉదయభాస్కర్‌రెడ్డి, పందలపాకకు చెందిన సుర్ల శ్రీనివాసరావులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. వారికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శలు

మధురపూడి: కాపవరంలో ఇటీవల మృతి చెందిన నానాసి సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. అలాగే మాతృమూర్తిని కోల్పోయిన గాదరాడకు చెందిన డాక్టర్ శివను ఓదార్చారు. రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నేతుల చిన్నిని కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కలవచర్లలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కాటవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కలవచర్లలో కొనసాగిన గడప గడపకూ..

రాజానగరం: సీఎం జగన్ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కలవచర్లలో రెండోరోజు బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. సమస్యలేమైనా ఉన్నాయా అని వారిని ఆరా తీశారు. అలాగే సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. గడచిన నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఏ పథకం ద్వారా లబ్ధి పొందాలన్నా ముందుగా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో అటువంటి సమస్యలు లేవన్నారు. అర్హులైతే చాలు ప్రభుత్వ పథకాలు కాళ్ల దగ్గరకు వస్తున్నాయన్నారు. ఇటువంటి ప్రజారంజకమైన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు దంతులూరి రఘువర్మ, తోరాటి శ్రీను, పెదిరెడ్డి శ్రీను, పూడి పెదకాపు, కమిడి కష్ణ, చింతా శ్రీను, పసుపులేటి వాసు, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్ని వర్గాలకూ లబ్ధి

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సవిరంగా వివరించి, వైఎస్సార్ సీపీని ప్రజలకు మరింత చేరువచేయడమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉభయ గోదావరి జిల్లా యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ఆయన బుధవారం కాటవరంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీటీసీ తాడిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ కోన రామకృష్ణ, పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, చిట్టూరి సురేంద్ర, నాని, పెద్దింటి కనక ప్రసాద్, కురుటూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పింగళి వెంకయ్య



కొంకుదురులో పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పింగళి వెంకయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ అధికారులు

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. తొలుత వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇన్‌చార్జి హెచ్‌ఎం కొప్పిశెట్టి శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ భారతీయులలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నింపడంతో కీలకపాత్ర పోషించిన జాతీయ జెండా రూపకర్త మన తెలుగు వ్యక్తి కావడం గర్వకారణమని అన్నారు. ధన్యజీవి పింగళి వెంకయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, లక్ష్మణరెడ్డి అప్పారావు, వలీషా, సుధాకరరెడ్డి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: భారత జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.